క్లుప్తంగా

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

జాతీయస్థాయి టెన్నిస్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన విద్యార్థి సాయిచందన్ జాతీయస్థాయి టెన్నిస్ పోటీల్లో ప్రతిభ చాటాడు. స్థానిక గాయత్రీ స్కూల్ కరస్పాండెంట్ కృష్ణప్రియ కుమారుడు సాయిచందన్ ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన 25వ జాతీయ స్థాయి సీనియర్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ టెన్నిస్ విభాగంలో సత్తాచాటి బంగారు పతకం సాధించాడు. ఈ విద్యార్థిని పలువురు అభినందించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న పల్లె నరసింహారెడ్డి

కోవెలకుంట్ల: సంజామల మండలం గిద్దలూరుకు చెందిన పేద విద్యార్థి మణిసాయితేజకు పట్టణానికి చెందిన రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మద్దిలేటి కుమారుడు మణిసాయితేజ తెనాలి పట్టణంలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. విద్యార్థి చదువుకు తనవంతు సాయంగా రూ. 10వేలు అందజేశారు. కార్యక్రమంలో రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబులేసు, రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి, విద్యార్థి సంఘం నాయకులు సుబ్బయ్య, శివ, మద్దిలేటి పాల్గొన్నారు.

నేడు అమావాస్య పూజలు

బేతంచెర్ల: పట్టణంలోని గొరిపేట ఆంజనేయ స్వామి, బైటిపేటలో వెలసిన గాడుబావి వీరాంజనేయస్వామి, నంద్యాల రహదారిలో వెలసిన పలక చింతమాను ఆంజనేయస్వామి ఆలయాల్లో సోమవారం మాఘమాస అమావాస్య పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. గాడుబావి వీరాంజనేయ స్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలతో పాటు సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం, భజన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హోరాహోరీగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



కబడ్డీ ఆడుతున్న యువకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి గ్రామ సమీపాన వెలసిన భోగేశ్వరస్వామి, నీలకంఠేశ్వరస్వామి కల్యాణోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగాయి. 16 జట్లు పాల్గొన్న ఈ పోటీలను ఆలయ మాజీ చైర్మన్ చంద్రశేఖరప్ప, గ్రామ సర్పంచ్ యుగంధర్‌రెడ్డి, అర్చకులు చంద్రశేఖర్ శర్మ ప్రారంభించారు. యువకుల ఈలలు, కేరింతల మధ్య కబడ్డీ పోటీలు ఉల్లాసంగా సాగాయి.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

డోన్: ద్రోణాచలం సేవాసమితికి చెందిన ఆత్మబంధువు సభ్యులు ఆదివారం అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక శ్రీనివాస థియేటర్ సమీపంలో గుర్తు తెలియని దాదాపు 50 ఏళ్ల వ్యక్తి మృతి చెంది ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల సూచన మేరకు ఆత్మబంధువు సభ్యులు షాధిఖాన రాజు, పానీపూరి మురళీ, తాహెర్ బాషా, షాహిద్‌వలి తదితరులు హిందూ సంప్రదాయం ప్రకారం మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేశారు. కార్యక్రమంలో పట్టణ పోలీసులు వెంకటేష్‌నాయక్, శివకుమార్‌లు పాల్గొన్నారు.

మహిళ మృతి

పెండ్లిమర్రి: వైఎస్సార్ జిల్లా పొలతల క్షేత్రంలో ఆదివారం కర్నూలు జిల్లా బేతంచర్లకు చెందిన చాకలి లక్ష్మిదేవి(57) గుండెపోటుతో మృతి చెందింది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు..లక్ష్మిదేవి మల్లేశ్వరస్వామిని దర్శించుకుని కుర్చోని ఉండగా అస్మాత్తుగా గుండెపోటుకు గురై అక్కడిక్కడే క్రిందపడి చనిపోయింది. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించడానికి పెండ్లిమర్రి తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజు అంబులెన్స్ పిలిపించారు. మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.15వేలు ఆర్థిక సహాయం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

వైద్యం మరింత చేరువ!

- రూ.22 కోట్లతో రూపుదిద్దుకుంటున్న వంద పడకల హాస్పిటల్
- అందుబాటులోకి రానున్న సకల వైద్య సేవలు
- తుదిమెరుగులు దిద్దుకుంటున్న ఏరియా ఆసుపత్రి



బనగానపల్లెలో రూ. 22 కోట్లతో నిర్మిస్తున్న వందపడకల ఏరియా ఆసుపత్రి

బనగానపల్లె: వైద్య, విద్యా, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యతినిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజావైద్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. సచివాలయ వ్యవస్థలతో ప్రజలవద్దకే పాలన తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య సేవలను మరింత చేరువగా తీసుకొస్తున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ అమలు చేస్తూ గ్రామాల్లో నేరుగా ప్రజలకు వైద్య సేవలు అందజేస్తున్న విషయం తెలిసిందే. ఆసుపత్రుల పునరుద్ధరణలో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరువతో బనగానపల్లె కమ్యునిటీ హాస్పిటల్‌ను వందపడకల ఆసుపత్రిగా స్థాయి పెంచింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఈ మేరకు కేఎంవీ ప్రాజెక్టు లిమిటెడ్ సంస్థ ఆసుపత్రిని సుందరంగా సకల వసతులతో నిర్మిస్తుంది. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.22 కోట్లతో చేపట్టిన ఏరియా ఆసుపత్రి (వంద పడకలు) భవన నిర్మాణం తుది మెరుగులు దిద్దుకుంటుంది. మూడు అంతస్తులతో ఆసుపత్రి భవనం సుందరంగా నిర్మితమవుతుంది. రోగులు, వైద్యులకు అనుగుణంగా భవనాన్ని నిర్మిస్తుంది కేఎంవీ ప్రాజెక్టు లిమిటెడ్ సంస్థ. అధునాతన వసతులు, లిఫ్ట్ సౌకర్యంతో రూపుదిద్దుకుంటుంది ఏరియా ఆసుపత్రి నూతన భవనం. జిల్లా కేంద్రం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి దీటుగా వసతులు కల్పిస్తున్న ఏరియా ఆసుపత్రి బనగానపల్లె మండలంలో పాటు అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల, బేతంచర్ల మండలాలతో పాటు ప్యాపిలి, దొర్నిపాడు పాణ్యం మండలాల పరిధిలోని కొన్ని గ్రామాల ప్రజలు వైద్యసేవలు పొందనున్నారు. ఇప్పటికే మంచాలు, ఇతర ఫర్నీచర్‌ను ప్రభుత్వం సరఫరా చేసింది. ఆపరేషన్ థియేటర్లలో అవసరమైన పరికరాలతో పాటు కాన్పుల వార్డుల్లో అన్ని వసతులు కల్పించేందుకు అవసరమైన మెటీరియల్స్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది.

మూడు ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు

నూతన భవనాన్ని జీప్లస్‌త్రీగా నిర్మిస్తున్నారు. మెడికల్ సర్జికల్ గైనిక్ ఆప్తామాలజీ, చిన్నపిల్లలు ఈఎన్‌టీ వంటి విభాగాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా వార్డుల ఇన్‌పెషెంట్ విభాగాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించనున్నారు. మూడు అధునిక ఆపరేషన్ థియేటర్లు, ఐసీయూ, రక్త పరీక్ష ల్యాబ్‌లు, ఎక్స్‌రే యూనిట్లు అందుబాటులోకి రానున్నాయి. రానున్న రోజుల్లో ఇక్కడే ఎముకలకు సంబంధించిన ఆపరేషన్ నిర్వహించనున్నారు. గుండె, ఊపరితిత్తులు, నరాలు, చర్య వ్యాధులకు సంబంధించి వైద్యసేవలు సైతం ఆసుపత్రిలో అందించనున్నారు. పీఎస్ఏ ఆక్సిజన్ ప్లాంట్ కూడా అందుబాటులోకి రానుంది. ఏరియా ఆసుపత్రి నిర్మాణానికి ప్రత్యేక చొరువ తీసుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ... డాక్టర్లు, వైద్య సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకున్నారు. నూతన బనగానపల్లె ఏరియా ఆసుపత్రిలో డాక్టర్లు, నర్సులు, టెక్నికల్ సిబ్బంది మొత్తం 84 మంది విధులు నిర్వహించనున్నారు.

ఏరియా ఆసుపత్రిలో ఉద్యోగుల వివరాలు

వందపడకల ఆసుపత్రిలో మొత్తం పోస్టులు : 84

పోస్టులు	సంఖ్య
సీఎస్ఆర్ఎంఓ	1
సివిల్ సర్జన్‌లు	5
సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు	12
స్టాఫ్ నర్సులు	24
నర్సింగ్ ఆర్డర్లీ	12
హెడ్ నర్సులు	4
సినియర్ అసిస్టెంట్	2
ఫార్మసిస్టు గ్రేడ్-2	4
ల్యాబ్‌టెక్నిషియన్స్	3
ఇతర పోస్టులు	17

గతంలో వైద్య సేవలు అందక...

గతంలో సరైన సమయంలో వైద్యం అందక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రత్యేకించి జిల్లాలోనే నాపరాతి మైనింగ్ గనులతో పాటు పాలిషింగ్ ప్యాక్టరీలు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నందున కార్మికులు తరచూ ప్రమాదాలకు గురవుతూ వైద్య సేవలు సక్రమంగా అందక ఇబ్బందులకు గురయ్యారు. తప్పని పరిస్థితుల్లో నంద్యాల, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి. సరైన సమయంలో ఆయా ఆసుపత్రులకు వెళ్లలేక పరిస్థితులు విషమించి క్షతగాత్రులు మృతి చెందిన సంఘటనలు ఎన్నో. ప్రస్తుతం వందపడకల ఆసుపత్రిలో అన్నివసతులు కల్పిస్తున్నందున ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం



ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ప్రత్యేకించి నా ఆధ్వంలో ఏరియా ఆసుపత్రి నిర్మాణం ఎంతో సంతృప్తినిస్తుంది. సకల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. నంద్యాల, కర్నూలుకు వెళ్లకుండా ఇక్కడే అన్ని వైద్యసేవలు అందనున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు కృషి చేస్తున్నాం.

– కాటసాని రామిరెడ్డి,ఎమ్మెల్యే బనగానపల్లె నియోజకర్గం

నాణ్యత ప్రమాణాలతో ఆసుపత్రి నిర్మాణం



వంద పడకల ఆసుత్రిని నాణ్యత ప్రమాణాలతో నిర్మిస్తున్నాం. అధునాతన డిజైన్ మేరకు రోగులు, వైద్యులకు అనుగుణంగా భవన నిర్మాణాలు చేపట్టాం. 2020 నవంబరులో ఆసుపత్రి నిర్మాణ పనులు ప్రారంభించాం. శరవేంగా పనులు చేపట్టాం. ప్రస్తుతం తుదిమెరుగులు దిద్దుతున్నాం. త్వరలో ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తవుతాయి.

– కె శివారెడ్డి, డైరెక్టర్, కేఎంవీ ప్రాజెక్టు లిమిటెడ్

అందుబాటులోకి సకల వైద్య సేవలు



వంద పడకల ఆసుపత్రిలో రోగులకు సకల వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆసుపత్రిలో మూడు ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మెడికల్, సర్జికల్ ఆప్తామలజీ, చిన్నపిల్లలు, ఈఎన్‌టీతో పాటు మరిన్ని విభాగాలను ఏర్పాటు అవుతున్నాయి. ఆయా వార్డుల ఇన్‌పెషెంట్ విభాగాలను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించనున్నాం.

– డాక్టర్ సుజాత సివిల్ సర్జన్, బనగానపల్లె

ఛత్రపతి శివాజీ జయంతి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 393 జయంతి వేడుకలను విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆంజనేయ స్వామి ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం, మెయిన్ బజార్‌తో పాటు పట్టణ పురవీధుల గుండా యువకులు ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. దేశ సమైక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మధు మోహన్‌రెడ్డి, గాజుల హరి, నాగ మోహన్, డక్కి శేఖర్, కిరణ్, చిరంజీవి, అజయ్,రవి, ప్రదీప్, ధరణి, రవి కిరణ్ నాయుడు, గోవిందు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: స్థానిక సుంకులా పరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం భవసారీ క్షత్రియ పెద్దలు హిందూ ధర్మం కోసం పోరాడిన ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ సేలను ఈ సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ మాదవరెడ్డి, బీజేపీ నాయకుడు డి వెంకటసుబ్బయ్య గుర్తు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది జగన్నాథ్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు రమణారెడ్డి, ఓబులరెడ్డి, దాసరి శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, శివరామిరెడ్డి, తుకారం,శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని తిమ్మనాయినపేట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాయినపల్లెకు చెందిన రాజశేఖర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై సంజామల మండలం పేరుసోములకు వెళ్తుండగా తిమ్మనాయినపేట నుంచి పేరుసోములకు వెళ్లె ప్రధాన రహదారిలో మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. బైక్, ఆటో ఢీకొనడంతో రాజశేఖర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనను 108 వాహన సిబ్బంది కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు నంద్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

కమనీయం... శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు



యాగంటి క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సతీమణి కాటసాని జయమ్మ, కుమారుడు కాటసాని ఓబులరెడ్డి



శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న వేద పండితులు



స్వామివారి హారతి తీసుకుంటున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

బనగానపల్లెరూరల్: మహాశివరాత్రి బ్రహ్మత్సవాల్లో భాగంగా మండలంలోని యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శనివారం శివపార్వతుల కల్యాణం కమనీయంగా సాగింది. ముందుగా అర్ధరాత్రి లింగోద్భవ ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం తెల్లవారు జామున 4.30గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరిగింది. ప్రత్యేకమైన కల్యాణ మండపంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను వధు, వరులుగా ముస్తాబు చేసి వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామివార్ల కల్యాణం సంప్రదాయబద్ధంగా రమణీయంగా జరిగింది. స్వామి,అమ్మవార్ల కల్యాణాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం డైరెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు తిలకించారు. సాయంత్రం నందికోల ఉత్సవం సంప్రదాయ బద్ధంగా ఆలయ అధికారులు నిర్వహించారు. రేలా రే రేలా , జబర్దస్త్ బృందం హాస్య కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది.

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు

బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి,ఆయన సతీమణి కాటసాని జయమ్మ, కుమారుడు కాటసాని ఓబులరెడ్డి యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వర స్వామిని దర్శంచుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులను ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ బుచ్చిరెడ్డి సన్మానించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

కోవెలకుంట్ల: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బనగానపల్లె నియోజకవర్గంలోని శివాలయాల్లో ఆదివారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. స్థానిక గాంధీసెంటర్‌లో వెలసిన సిద్ధేశ్వర స్వామి, కాశీవిశ్వనాథుని ఆలయాలు, ఏడుకొప్పెర్ల బావి సమీపంలో వెలసిన అగస్తీశ్వర స్వామి ఆలయం, గాంధీనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ఆవరణలో వెలసిన శివాలయం, బనగానపల్లె చౌరస్తాలో నాగలింగేశ్వరస్వామి, పట్టణ శివారులోని జుర్రేరు ఒడ్డున ఉన్న శివాలయంతోపాటు గ్రామా ల్లోని ఆలయాల్లో ముందుగా వేద పండితుల ఆధ్వర్యంలో అభిషేకం, బిల్వార్చన, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, కలశస్థాపన, గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ జపాలు, తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉమామహేశ్వరుల కల్యాణం వేడుకగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణ వేడుకలను తిలకించారు. అదేవిధంగా శివపార్వతుల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం చేపట్టారు.

కొలిమిగుండ్ల: మహాశిరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెట్నికోటలోని గుండుమల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారు జామున ప్రసన్న పార్వతి గుండుమల్లేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిపించారు. వేదపండితులు ఆలూరి రాఘవేంద్రప్రసాద్, సుబ్రహ్మణ్యేశ్వరరావు, సుబ్బారావు ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజల అనంతరం భక్తుల సమక్షంలో కల్యాణం నిర్వహించారు. జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, రామ్‌కో సిమెంట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రెడ్డి నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, నాయకులు పేరం సత్యనారాయణరెడ్డి, ఆదినారాయణరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి, రెడ్డి నాగరాజు ప్రారంభించారు. అలాగే అంకిరెడ్డిపల్లెలోని శివాలయంలో పారిశ్రామిక వేత్త పల్లె సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా సాగింది.

వైభవంగా స్వామివారి కల్యాణం

డోన్ టౌన్: మహా శివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకొని శివాలయాల్లో శనివారం శివపార్వతుల కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆదివారం తెల్లవారు జామున బ్రహ్మ ముహూర్తంలో ఆయా దేవాలయాల ధర్మకర్తలు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపించారు. పట్టణ సమీపంలోని కొత్త, పాత బుగ్గలలో శివపార్వతుల కల్యాణోత్సవాలు కనుల పండువగా సాగాయి. కొత్త బుగ్గలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్ కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్ల పెళ్లి పెద్దలుగా వ్యవహరించగా పాతబుగ్గలో ఆలయ ధర్మకర్త బైసాని రాజు కుటంబ సభ్యులు శివపార్వతులకు కల్యాణోత్సవం జరిపించారు. అలాగే పోచా గార్డెన్స్‌లోని పురాతన శ్రీనగరేశ్వర స్వామి ఆలయంలో ధర్మకర్త డాక్టర్ పోచా ప్రభాకర్‌రెడ్డి, పట్టణ పోలీసు స్టేషన్ వద్ద ఉన్న శ్రీసాంబశివాలయంలో అర్చకులు కల్లె శేషావలి శర్మ, ఇందిరానగర్‌లో అభయాజంనేయ ఈశ్వరునికి అర్చకులు విజయ్, వైయస్సార్ నగర్‌లోని శివాలయంలో అర్చకులు హరి ఆధ్వర్యలో స్వామి, అమ్మవార్ల కల్యాణం కమనీయంగా జరిగింది.



రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



బేతంచెర్ల పూదోట మఠంలో శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల : ముచ్చట్ల భ్రమరాంభ మల్లికార్జునస్వామి కల్యాణం ఆదివారం తెల్లవారు జామున అర్చకులు నరేష్ శర్మ, పుల్లయ్య శర్మ ఆధ్వర్యంలో కమనీయంగా సాగింది. ముందుగా స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు అభిషేకం, కుంకుమార్చన నిర్వహించి అలంకరించారు. అదేవిధంగా పట్టణంలోని పూదోట మఠంలో వెలసిన భేతేశ్వరస్వామి, శ్యామలాంభ అమ్మవారి కల్యాణం అంగరంగవైభవంగా జరిగింది. సిద్ధేశ్వరస్వామి, బనగానపల్లె రహదా రిలో వెలసిన జటాధర స్వామి, యంబాయి గ్రామంలో వెలసిన రామలింగేశ్వరస్వామి, భోగేశ్వర స్వామి, సిమెంటునగర్‌లో వెలసిన జీవబుగ్గలింగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రూప్ దేవాలయాల ఈఓ మద్దిలేటి, చైర్మన్ గుండా జగన్ మోహన్‌రావు, మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త మల్లుహుసేన్‌రెడ్డి, పూదోట ఆశ్రమ కమిటీ సభ్యులు గుండాగోపాలు, బుగ్గన విశ్వనాథ్ రెడ్డి, సముద్రాల రామకృష్ణ, దామోదరయ్య, రామసుబ్బడు పాల్గొన్నారు.

ప్యాపిలి: శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక నీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో ఆదివా రం ఉదయం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు పట్టణ ప్రధాన వీధుల మీదుగా గ్రామోత్సవం నిర్వహించారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు




పోటీలు ప్రారంభిస్తున్న ఎర్రబోతుల పాపిరెడ్డి



పోటీలు తిలకించేందుకు భారీగా వచ్చిన జనం

కొలిమిగుండ్ల: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పెట్నికోట సమీపంలోని గుండుమల్లేశ్వర స్వామి క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండ లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. పాలపళ్ల సైజు విభాగం పోటీలను జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించారు. పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి జనం భారీగా తరలివచ్చారు. వైఎస్ఆర్ కడప జిల్లా చిన్న నాగిరెడ్డిపల్లెకు చెందిన నారంగారి తారక్‌రెడ్డి, అదే జిల్లా వీరపునాయినపల్లెకు చెందిన గంగిరెడ్డిగారి గంగిరెడ్డికి చెందిన కంబైన్డ్ ఎడ్ల జత మొదటి బహుమతిని కైవసం చేసుకున్నాయి. అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం చాగల్లుకు చెందిన ఆదినారాయణ వృషభాలు రెండవ స్థానాన్ని దక్కించుకున్నాయి. అనంతపురం జిల్లా చిలమకూరుకు చెందిన పుట్లూరి సుదర్శన్ ఎడ్ల జత మూడవ స్థానం, ప్యాపిలి మండలం గుడిపాడుకు చెందిన ఎంపీటీసీ సభ్యుడు రాగుల వెంకట్రామిరెడ్డి, పీఆర్ పల్లెకు చెందిన హోటల్ బలరాముడుకు చెందిన కంబైన్డ్ ఎడ్లజత నాల్గవ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు చొప్పున నగదు బహుమతులను జెడ్పీచైర్మన్ పాపిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో రామ్‌కో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రెడ్డినాగరాజు, వైఎస్సార్‌సీపీ నేత కాటసాని ప్రసాదరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

21నుంచి పెద్దమ్మ దేవర



బనగానపల్లె: భక్తుల కోర్కెలు తీర్చే అమ్మ...పెద్దమ్మ దేవర మంగళవారం అంగరంగవైభవంగా ప్రారంభం కానుంది. బనగానపల్లెలోని భానుముక్కల గ్రామంలో ఈ నెల 21, 22న గ్రామ రైతు సంఘం, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో పెద్దమ్మ దేవరను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు భానుమ్ముకల రైతు సంఘం సభ్యులు. 21న రాత్రి 12 గంటలకు అమ్మవారి ప్రతిష్ట కార్యక్రమం, 22న అమ్మవారికి భోనాల సమర్పణ ఉంటుందని సభ్యులు తెలిపారు. భానుముక్కల గ్రామంలో 2012వ సంవత్సరం ఫిబ్రవరి నెల 28,29 తేది దేవర నిర్వహించడం జరిగింది. మళ్లీ 11 సంవత్సరాల తరువాత దేవరను పెద్ద ఎత్తున్న నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పట్టణంలో ట్రాఫిక్ అంక్షలు

పట్టణంలోని భానుముక్కలలో ఈ నెల 21,22న జరిగే శ్రీ పెద్దమ్మ దేవర సందర్భంగా పట్టణంలోకి వచ్చే వాహనాలపై ట్రాఫిక్ అంక్షలు విధించిన్నట్లు ఎస్ఐ రామిరెడ్డి ఆదివారం తెలిపారు. 22వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పట్టణంలో సిమెంట్ లారీ, భారీ వాహనాలను, ట్యాంకర్లను అనుమతి రద్దు చేశామన్నారు. బస్టాండ్, పోలీసు స్టేషన్, ఎల్‌బీసీ కార్యాలయం మీదుగా వచ్చేవాహనాలు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద డైవర్ట్ చేసి తెలుగుపేట, బీవీ సుబ్బారెడ్డి ఫంక్షన్‌హాల్ వైపు మళ్లించామన్నారు. జీఎం టాకీస్, అస్తానం మీదుగా వచ్చే వాహనాలను పాత బస్టాండ్ నుంచి డైవర్ట్ చేసి శివనంది నగర్ వైపు మళ్లించామని, కోవెలకుంట్ల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు గులాంనబీపేట కైప గ్రామాల మీదుగా బనగానపల్లెకు రావాల్సి ఉంటుందన్నారు. అవుకు వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు ఏపీ మోడల్ స్కూల్ వద్ద నుంచి జీఎన్ఎస్ఎస్ కెనాల్ మీదుగా పట్టణంలోకి రావాలని, చిన్నవాహనాలు ఎస్సార్‌బీసీ కెనాల్ మీదుగా టౌన్‌లోకి వెళ్లొచ్చన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ రామిరెడ్డి తెలిపారు.

ఆర్‌డీ వ్యాక్సిన్ సద్వినియోగం చేసుకోండి

అవుకు: స్థానిక పశువైద్యశాలలో ఆర్‌డీ వ్యాక్సిన్(రానికెట్ డిసీస్) అందుబాటులో ఉందని, కోళ్ల పెంపకదారులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి భారతీదేవి సూచించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అవుకు, గుండ్ల శింగవరం పశువైద్యశాలల పరిధిలోని గ్రామాలలో దాదాపు 50వేలకుపైగా వివిధ రకాల కోళ్లు ఉన్నాయన్నారు. ప్రస్తుతం కోళ్లకు కొక్కెర తెగులు వచ్చే ప్రమాదం ఉందని, ఆర్‌డీ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. కొక్కెర తెగులు తెగులు వచ్చిన కోళ్లను ఆరోగ్యంగా ఉన్న కోళ్లకు దూరంగా ఉంచాలని తెలిపారు. తెగులు వచ్చిన కోళ్లు ఆకుపచ్చ రంగులో పారుకోవటం, తలను వంకరగా తిప్పి ఉంచటం, ముడుచుకొని కూర్చోవటం లాంటి లక్షణాలు కలిగి ఉంటాయని తెలిపారు.